సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 10, డిసెంబర్, 2024



సోమశిలలో 72.85 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 72.85 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 3025 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,940
22 క్యారెట్లు (1 గ్రా ఆర్నమెంట్)	రూ.7,164
3 శాతం జీఎస్టీతో	రూ.7,379
సవర (8 గ్రాములు)	రూ.59,032

గరిష్టం/కనిష్టం
32.7 /25.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 81 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వెంగమాంబ ఆలయ హుండీ కానుకల లెక్కింపు



హుండీల నగదు లెక్కిస్తున్న దృశ్యం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ శ్రీవెంగమాంబ ఆలయ హుండీలను సోమవారం దేవస్థాన సన్నిధిలో లెక్కించారు. నెల్లూరు మూలాపేట శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థాన ఈఓ పి.కవిత పర్యవేక్షణలో హుండీలు లెక్కించారు. గత ఆగస్టు 7 నుంచి సోమ వారం వరకు భక్తులు సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.21,79,632 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి వి.ఉషశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ స్టేట్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు నుంచి బెజవాడకు ప్రయాణం ఇక 5 గంటలే

నెల్లూరు సిటీ: ఆర్టీసీ లగ్జరీ బస్సులు కొన్నింటి ద్వారా నెల్లూరు నుంచి విజయవాడకు ఇక నుంచి 5 గంటల్లో ప్రయాణం చేయవచ్చని నెల్లూరు డిపో 1 మేనేజర్ మురళీకృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి ఉదయం 8.30, మధ్యాహ్నం 2.30, రాత్రి 10.30 గంటలకు బయలుదేరే ఈ బస్సులకు గుంటూరులో మాత్రమే స్టాపింగ్ ఉంటుందన్నారు. అదే విధంగా విజయవాడ నుంచి నెల్లూరుకు ఉదయం 7.15, సాయంత్రం 4 గంటలకు బయలుదేరతాయని, వీటికి కావలిలో మాత్రమే స్టాపింగ్ ఉంటుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కండలేరులో 55.292 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం 55.292 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 4,800 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాతపై బీమా భారం

ఉచిత పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం

- బీమా ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- ఈ నెలాఖరు వరకు తుది గడువు
- ఆందోళనలో అన్నదాతలు

అన్నదాతలు సాగు చేసిన పంటలు ప్రకృతి విపత్తులు, ఇతర చీడపీడలతో దిగుబడి తగ్గి నష్టం వచ్చినప్పుడు ఉచిత పంటల బీమా పథకం ఎంతో ఉపకరిస్తుంది. బీమా చేయించుకున్న రైతులకు పరిహారం అందుతుంది. అయితే ఆయా పంటలకు కంపెనీలు నిర్ధారించిన ప్రీమియం సొమ్ము చెల్లించాల్సి ఉంది. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ పథకానికి కూటమి సర్కార్ మంగళం పాడేసింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉదయగిరి/పొదలకూరు: అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలకు కనీసం గిట్టుబాటు ధర లేదు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న అన్నదాతపై ఏమాత్రం కనికరం లేకుండా.. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5.50 లక్షల ఎకరాల్లో వివిధ పైర్లు సాగు చేస్తున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు ఈ నెలాఖరు లోపు ప్రీమియంను ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

ప్రీమియం చెల్లించే విధానం

2024–25 ఆర్థిక ఏడాదికి ప్రభుత్వం గుర్తించిన వరి, మినుము పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రబీలో సాగుచేసే రైతులు స్వయంగా పంటల వారీగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. డిసెంబరు 15వ తేదీలోపు మినుము, పెసర, శనగ, వేరుశనగకు, ఈనెల 31వ తేదీలోపు వరికి రైతులే స్వయంగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీనిపై రైతులకు కనీసం అవగాహన కూడా కల్పించడం లేదు.



ఉదయగిరిలో ఇటీవల వర్షాలకు నేలకొరిగిన వరి

ప్రీమియం భారం భరించిన జగన్ సర్కార్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా పథకం అమలు చేసింది. ఒక్క పైసా కూడా రైతుల నుంచి చెల్లింపులు లేకుండా బీమా కంపెనీలకు ప్రభుత్వమే చెల్లించేది. 2019 నుంచి ఈ–క్రాప్ ఆధారంగా అన్ని రకాల పంటలకు చెల్లింపులు జరగడంతో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్న ప్రతిసారి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్ట పరిహారం నగదు జమయ్యేది. రైతులకు తెలియకుండానే ప్రీమియం చెల్లింపులు, నష్ట పరిహారం వచ్చేవి. రైతుకు ఎంతో మేలు జరిగేది. వ్యవసాయం దండగ అనే నానుడి నుంచి పండగ అనే పరిస్థితులు జగన్ సర్కార్ కల్పించింది. గత ఐదేళ్లలో ఉచిత పంటల బీమా పథకం ద్వారా జిల్లా రైతులకు రూ.కోట్ల నగదు ఖాతాల్లో జమైంది. అంతేకాకుండా సీజన్ వారీగా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించారు. వైఎస్సార్ రైతు భరోసా, పంట రుణాలపై సున్నా వడ్డీ పథకాలు అమలు చేసి రైతుల పాలిట దేవుడుగా జగన్ చెరగని ముద్ర వేసుకున్నారు.

రైతులపై మోయలేని భారం

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం రైతులపై మోపింది. బీమా అమలు కావాలంటే ఈ సీజన్ నుంచే రైతులు ప్రీమియం చెల్లించాలి. దీంతో చాలా మంది రైతులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వమే అంతా చెల్లించిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. పంటలు సాగు చేసేందుకు పెట్టుబడి కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతుంటే ఉచిత పంటల బీమాకు ప్రీమియం మరింత భారంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రీమియం ఎక్కడ చెల్లించాలో కూడా తెలియడం లేదు. మీ–సేవ, బ్యాంకులు, రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు.

పంటపేరు	ప్రీమియం (హెక్టారుకు)	పరిహారం
వరి	రూ. 168	రూ.1,05,000
మినుము	రూ.95	రూ. 47,500
శనగ	రూ.140	రూ.70,000
పెసర	రూ.90	రూ.45,000
వేరుశనగ	రూ.150	రూ.75,000

రైతులు చెల్లించలేరు



పంటల బీమా ప్రీమియం సొమ్ము గతంలో మాదిరే ప్రభుత్వమే చెల్లించి రైతులను ఆదుకోవాలి. కూటమి ప్రభుత్వం విధానంతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. ప్రీమియం రైతులు చెల్లించే పరిస్థితి లేదు. దీంతో ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ రాక రైతులు నష్టపోతారు. రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సొమ్ము కూడా ఇవ్వలేదు. ఇప్పటికే అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తున్నాం. కనీసం ఉచిత పంటల బీమా పథకం అయినా అమలు చేయాలి.

–సురేష్, రైతు

సాగుదారులే ప్రీమియం కట్టాలి



ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ప్రయోజనం పొందాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ప్రక్రియ రైతులకు అలవాటైతే క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తద్వారా బీమా చేయించుకున్న రైతులు పంటలు దెబ్బతింటే నష్ట పరిహారం అందుతుంది. ఈనెల ఆఖరిలోపు రైతులందరూ ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

– చెన్నారెడ్డి, సహాయ సంచాలకులు, ఉదయగిరి

పంటల బీమా గురించి తెలియదు



పంటలకు బీమా గురించి తెలియదు. అధికారులు కూడా ఎవరూ చెప్పిన దాఖలాలు లేవు. ఎక్కడ, ఎప్పుడు నమోదు చేసుకోవాలో సమాచారం తెలియదు. సమయం ఉంటే నమోదు చేసుకుంటాం. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులను రైతులు ఎదుర్కొన్న దాఖలాలు లేవు.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

ప్రభుత్వమే చెల్లించాలి



రైతులకు సంబంధించిన పంటల బీమా నగదును ప్రభుత్వం చెల్లిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో ప్రభుత్వమే చెల్లించడం వల్ల బీమా గురించి తెలియకపోయినా ఇబ్బందులు తలెత్తలేదు. ఈ క్రాప్ మాత్రం వ్యవసాయశాఖ సిబ్బంది చేశారు.

– జి.నారాయణరెడ్డి, రైతు, పులికల్లు.

11 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

గుడ్లూరు: సోమవారం గుడ్లూరులో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరు కాని 11 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశించారు. ఆ మేరకు ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు నోటీసులు జారీ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ జి.స్వర్ణ ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. 11 గంటల వరకూ కనీసం ఒక అర్జీ కూడా రాలేదు. ఈ క్రమంలో ఎంపీడీఓ కార్యాలయానికి తనిఖీ నిమిత్తం ఎమ్మెల్యే వచ్చారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడాన్ని ఎమ్మెల్యే గమనించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. వెంటనే ఆయా అధికారులకు షోకాజ్ నోటీసులను ఎంపీడీఓ జారీ చేశారు. ప్రజా సమస్యలపై ఏడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని కంప్యూటరీకరణ చేయించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోవర్ధన్, హౌసింగ్ ఏఈ కె.వెంకటేశ్వర్లు, ఏపీఓ అబ్దుల్, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కరాజువారికండ్రిగలో ఉద్రిక్తత

- పేదల భూములు ఆక్రమిస్తున్నారంటూ గ్రామస్తుల ఆందోళన
- యంత్రాలను అడ్డుకుని నిరసన తెలిపిన రైతులు



అక్కరాజువారికండ్రిగలో భూములు చదును చేస్తున్న యంత్రాలను అడ్డుకున్న స్థానికులు

బిట్రగుంట: బోగోలు మండలం అక్కరాజువారికండ్రిగలో భూముల వ్యవహారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. స్థానికులు మేత పోరంబోకుగా వినియోగించుకుంటున్న వందలాది ఎకరాల భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానికులకు, స్థానికేతరులకు మధ్య వివాదం నెలకొంది. భూమి దున్నేందుకు ప్రయత్నిస్తున్న స్థానికేతరులను, యంత్రాలను స్థానికులు అడ్డుకోవడంతో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. అక్కరాజువారికండ్రిగకు సమీపంలోని సుమారు 900 ఎకరాల భూములను ఈనాం భూములుగా లబ్ధిపొందిన సుమారు 400 మంది స్థానికులు సాగుచేసుకుంటున్నారు. కొంత భూమిని గ్రామస్తులు మేత పోరంబోకుగా వినియోగించుకుంటున్నారు. ఈ భూములు కొంత మేర కొనుగోలు చేశామని చెబుతూ స్థానికేతరులు సాగుచేసేందుకు ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. స్థానికేతరులను, యంత్రాలను అడ్డుకుని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అక్కరాజువారి కండ్రిగ భూములకు సంబంధించిన పాత సర్వే నంబర్లు 257, 260లలో రెవెన్యూ రికార్డుల్లో ఈనాం భూములుగా స్పష్టంగా నమోదై ఉన్నాయని చెబుతున్నారు. అదే విధంగా సర్వే నంబర్లు 935, 936లకు ఆరు భిన్నాలు సృష్టించి సుమారు 66 ఎకరాలకు తప్పుడు రికార్డులు సృష్టించి స్థానికేతరుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపిస్తున్నారు. ఈ 66 ఎకరాలను ఆసరాగా చేసుకుని మరో 120 ఎకరాల మేర ఆక్రమించుకునేందుకు ట్రాక్టర్లతో దున్నుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తప్పుడు రికార్డులతో భూములు కొల్లగొట్టాలని ప్రయత్నిస్తున్న అక్రమార్కులతో పాటు వారికి సహకరించిన రెవెన్యూ అధికారులపై జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అక్కరాజువారికండ్రిగ భూముల వ్యవహారంపై గ్రామస్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు, అక్రమార్కులు కుమ్మక్కై ఈనాం, అటవీ భూములు కొల్లగొట్టాలని ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



భూముల వ్యవహారంపై ప్రజాసమస్యల పరిష్కార వేదకలో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఊరంతా నేల బావులే

ఇంటింటికీ తాగునీటి అవసరాలు తీర్చుతూ..

- 200 ఎకరాల వరిసాగుకు కూడా అవే ఆధారం
- ఇదీ తిక్కవరప్పాడు గ్రామ ప్రత్యేకత

ఆ గ్రామంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే మే నెలలోనూ నీటి ఎద్దడి ఉండదు. చుట్టు పక్కల గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తినా ఆ ఊరిలో మాత్రం భిన్నమైన పరిస్థితి ఉంటుంది. దీనికి కారణం గ్రామంలో సగం పైగా నివాసాల్లో (దాదాపు 200) నేల బావులు ఉండటమే. అంతేకాక వ్యవసాయ పొలాల్లోనూ నేల బావుల ఆధారంగా వరి, కూరగాయలు సాగు చేస్తూ అక్కడి ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.

వెంకటాచలం: వెంకటాచలం మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిక్కవరప్పాడు గ్రామంలో 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ఊరిలో ఏళ్ల తరం నుంచి తాగునీటికి నేల బావులే ఆధారం. గతంలో గ్రామంలోని అన్ని కాలనీల్లో మొత్తం ఆరు నేల బావుల వద్దకు వచ్చి గ్రామ ప్రజలు నీటిని తోడుకుని వెళ్లేవారు. అప్పట్లోనూ తాగునీటి ఎద్దడి ఉండేది కాదని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పట్లో నివాసాల్లో బోర్లు వేసే ప్రయత్నాలు ఎన్నో సార్లు చేసినా వీలు కాలేదు. కాలక్రమేణా గ్రామస్తులు కొందరు తన నివాసాల్లో బావులు తవ్వుకున్నారు. ముందుగా తవ్విన వారి నివాసాల్లోని బావుల్లో ఎండాకాలంలోనూ బావి అడుగంటకుండా ఉండకపోవడం, నీరు తాగేందుకు మంచివి కావడంతో ప్రతి ఒక్కరూ తమ నివాసాల్లో బావులు తవ్వించారు. దీంతో మహిళలకు వీధి బావుల వద్ద నుంచి బిందెల మోత తప్పి, నివాసాల్లో ని బావుల వద్దే నీటిని చేదుకునేవారు. ప్రస్తుతం అందరి నివాసాల్లో బావులకు మోటార్లు అమర్చుకుని తాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా జీవిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వరంలో పలు కాలనీల్లో వాటర్ ట్యాంకులు నిర్మించి, పైపు లైన్ల ద్వారా కుళాయిలు ఏర్పరిచినా, అందరి నివాసాల్లోకి ఆ నీరు సరఫరా కాదు. నివాసాల్లో తవ్వుకున్న బావుల నుంచి నీటినే ఎక్కువగా వాడుకుంటున్నారు.

తిక్కవరప్పాడులో నేల బావి ఆధారంగా వరిసాగు చేసిన పొలం



వాటితోనే వ్యవసాయం

నివాసాల్లో తాగునీటికే కాకుండా వ్యవసాయ భూముల్లో పంటలు పండించుకునేందుకు తిక్కవరప్పాడు గ్రామంలో నేల బావులే ఆధారం. గ్రామంలో ఎక్కువ మంది పేద రైతులకు చెరువు ఆయకట్టు కింద వ్యవసాయ భూములు లేవు. సుమారు 70 కుటుంబాలు 200 ఎకరాల మెట్ట భూముల్లో వరిని నేల బావుల ఆధారంగానే సాగు చేస్తూ జీవిస్తున్నారు. బావుల్లో ఉన్న నీటితో అక్టోబరు నెలలో నార్లు పోసి నవంబరు 10 తేదీ కల్లా వరినాట్లు పూర్తి చేస్తారు. ఆ తరువాత అడపాదడపా వర్షాలు పడటం, బావుల్లో నిండా నీరు చేరడంతో వరిసాగుకు ఎలాంటి సాగు నీటి ఇబ్బందులు తలెత్తడం లేదు. అందరికంటే ముందుగానే ఫిబ్రవరి నెలలోనే వరి కోతలు ముగించుకుని పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకుంటున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటే తప్ప పంటలు పండకపోవడం అంటూ జరగదని రైతులు ధీమాగా చెబుతున్నారు. వరికోతలు పూర్తయిన తరువాత ఈ భూముల్లో మళ్లీ దుక్కి దున్ని మార్చి నుంచి సెప్టెంబరు వరకు కొంత మంది రైతులు కూరగాయలు పండించుకుంటున్నారు. వాటిని చుట్టు పక్కల గ్రామాల్లో, నెల్లూరు మార్కెట్‌కు తరలించి విక్రయించుకుంటున్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేవు



గ్రామంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రతి ఇంటికీ నేల బావులు ఉన్నాయి. మే, జూన్ నెలలోనూ నేల బావుల్లో పుష్కలంగా నీరు నిల్వ ఉంటుంది. గతంలో వీధి బావుల వద్ద మహిళల బిందెల మోత ఉండేది. ప్రస్తుతం మా గ్రామంలో ఆ పరిస్థితి లేదు.

– మండల వరప్రసాద్, తిక్కవరప్పాడు

బావుల ఆధారంతో సాగు



గ్రామంలో 200 ఎకరాలకు పైగా వరిసాగును నేల బావుల సాయంతో పంటలు పండించుకుంటున్నాం. అవే లేకుంటే గ్రామంలోని మెట్ట పొలాల్లో పంటలు పండించుకోలేం. ప్రతి రైతు తమ పొలంలో బావి తవ్వించుకుని, ఆ నీటి ఆధారంగా ప్రతి ఏటా పంటలు పండించుకుంటున్నారు.

– చంద్రమోహన్, తిక్కవరప్పాడు

మూడు మండలాలకు కందిపప్పు

సాక్షి ఎఫెక్ట్..

కందుకూరు రూరల్: కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాలకు కందిపప్పు స్టాక్ ఉన్నట్లు జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ సురేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కంది పప్పులో కక్కుర్తి' శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సివిల్ సప్లయీస్ అధికారులు డిసెంబర్ నెలకు సంబంధించి గుడ్లూరు మండలానికి 15.759 మెట్రిక్ టన్నులు, లింగసముద్రంకు 12.071 మె.ట, ఉలవపాడుకు 18.053 మె.ట. కంది పప్పు అలాట్మెంట్ చేసినట్లు తెలిపారు. కందుకూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం గోదాములో 29.980 మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందన్నారు. కందిపప్పు కావాల్సిన రేషన్ డీలర్లు డీడీ చెల్లించి తీసుకెళ్లి కార్డుదారులకు పంపిణీ చేయాలని తెలిపారు.

నకిలీ ఆర్టీఓల అరెస్టు



ఉలవపాడు: నకిలీ ఆర్టీఓలుగా హైవేపై వాహనాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. నవంబర్ 27న కారు మీద ఆర్టీఓ స్టిక్కర్ వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ వద్ద నుంచి రూ.3 వేలు తీసుకోవడంతో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం నకిలీ ఆర్టీఓలుగా వసూళ్లకు పాల్పడుతున్న నెల్లూరుకు చెందిన షేక్ సిరాజ్, సయ్యద్ లతీఫ్‌లను కరేడు ర్యాంపు వద్ద ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకట బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఈ కేసులో మరో ముద్దాయి కావలికి చెందిన హరీష్‌రెడ్డిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

వెల్లువెత్తిన వినతులు

• బాధిత వర్గాల ధర్నాలు.. నిరసనలు

నెల్లూరురూరల్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, సరైన నష్టపరిహారం ఇప్పించాలని, నకిలీ డాక్యుమెంట్లతో పొలం ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, ఉర్దూ పండిట్‌ను నియమించాలని, కోర్టు ఆదేశించినా ఉద్యోగాలు కల్పించడం లేదంటూ ఆయా వర్గాల వినతులు, ధర్నాలు, నిరసనలతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కిక్కిరిసింది. జేసీ కె.కార్తీక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు కలెక్టరేట్‌కు చేరుకుని అర్జీలు సమర్పించారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కార్తీక్, ఇతర అధికారులు

స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి


పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని చెబుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ బకాయిలను త్వరగా విడుదల చేయాలని, జీఓ నంబరు 77 రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు శివం వర్మ, హనీష్ తదితరులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,580 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉంచడం వల్ల కళాశాలల విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్నారు.

కోర్టు ఆర్డర్ ఉన్నా పోస్టింగ్ ఇవ్వలేదు


కలెకరేట్ వద్ద సమస్యను తెలుపుతున్న వీఓఏలు

టీడీపీ నాయకుల రాజకీయ కక్షలతో వీఓఏలుగా పని చేస్తున్న తమకు ఎటువంటి సమాచారం లేకుండా తొలగించారని, తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వెంకటాచలం మండలానికి చెందిన వీఓఏలు కామాక్షి, శ్యామల, సుభాషిణి తదితరులు జేసీ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో మొత్తం 200 మందిని తీసేశారని, 20 ఏళ్లుగా పనిచేస్తున్న మమ్మల్ని రాజకీయ కక్షతో తీసివేయడం దారుణమన్నారు. హైకోర్టు నవంబర్‌లో ఆదేశాలు జారీ చేసినా.. ఆర్డర్ కాపీలు పట్టుకుని నెల రోజులుగా తిరుగుతున్నా పోస్టింగ్ ఇవ్వడం లేదని వాపోయారు. ఉన్నఫళంగా తొలగించడంతో మా కుటుంబాలు వీధిన పడ్డాయని, వెంటనే తమను ఆదుకోవాలని కోరారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

నా భూమితో పాటు గ్రామంలోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై విచారణ చేసి న్యాయం చేయాలంటూ కలువాయి మండలం కుల్లూరుకు చెందిన లక్కాకుల శ్రీనివాసులు అధికారులను కోరారు. గ్రామ సర్వే నంబరు 445/1లో 0.15 సెంట్ల భూమిని దాదాపు 70 ఏళ్లుగా నా కుటుంబ సభ్యులతో కలిసి సాగు చేసుకుంటున్నామని, అయితే సమీప సర్వే నంబర్లలో సాగుదారులు నా భూమిని సైతం వారి పేరుపై అడంగళ్‌లో నమోదు చేసుకున్నారని, దీనిపై వారిని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇందుకు సహకరించిన వీఆర్‌ఓ, గ్రామ సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ధ్వంసం చేశారు.. చర్యలు తీసుకోండి

ఏఎస్‌పేట మండలం గుడిపాడ నుంచి గుంపర్లపాడుకు వెళ్లే రోడ్డును గుడిపాడుకు చెందిన అయ్యగారి జనార్దన్‌రెడ్డి, పుట్టుబోయిన మాలకొండయ్య జేసీబీతో తొలగించి ధ్వంసం చేశారని, పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుంటను ఆక్రమించారని గుడిపాడుకు చెందిన కుండా వెంకటసుబ్బారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు.

నివాస స్థలానికి సరైన నష్టపరిహారం అందించండి

9 ఏళ్లుగా నివాసముంటున్న తన ఇంటిని జాతీయ రహదారి అధికారులు ఖాళీ చేయాలని, పరిహారంగా రూ.1.80 లక్షల నగదు ఇచ్చారన్నారు. అయితే ఇంటిని రూ.7 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించుకున్నానని, ఆ విధంగా నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని నగరంలోని వెంకటేశ్వరపురానికి చెందిన షేక్ అర్జీయ వినతిపత్రం సమర్పించారు.

పొలం సమస్యను పరిష్కరించండి

గతంలో మాకు పొలం అమ్మిన వ్యక్తులు ప్రస్తుతం నకిలీ డాక్యుమెంట్లతో పొలాన్ని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలంటూ విడవలూరు మండలం వరిణి గ్రామ పంచాయతీ దళితవాడకు చెందిన దివ్యాంగురాలు పాటూరు అనిత, పాటూరు నరేష్ అధికారులను కోరారు. మమ్మల్ని బెదిరిస్తున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలి

వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే వారిని, ఒకరు బదిలీపై వెళ్లగా, మరొకరు రిటైర్ అయ్యారని, ప్రస్తుతం 225 మంది విద్యార్థులు ఉర్దూ భాషలో చదువుకున్నారని, వెంటనే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని కోరారు.


ఉర్దూ టీచర్‌ను నియమించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రభుత్వ భూమిగా మార్చారని.. కౌన్సిలర్ నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కౌన్సిలర్

తమకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు చేశారని, దానిని సరి చేయాలని నెలల తరబడి తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదంటూ ఆత్మకూరు మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి నిరసన తెలిపారు. ఆత్మకూరు మండలం నాగులపాడు మజరా చెర్లోయడవల్లి గ్రామంలో సర్వే నెం.172(1)లో 1.24 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేశారని, దానిని తొలగించేందుకు గత మే నెలలో దరఖాస్తు చేసుకుని తిరుగుతున్నామన్నారు.

మహిళలు, విద్యార్థినుల భద్రతకు చట్టాలపై అవగాహన

• సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి

వెంకటాచలం: విద్యార్థినులు, మహిళలు తమ భద్రతకు సంబంధించిన అంశాల్లో నైతిక, చట్టపరమైన సహకారాన్ని కోరడంలో వెనుకడుగు వేయకూడదని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం అందించడంలో చట్టపరమైన వ్యవస్థల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాకుటూరులోని వీఎస్‌యూలో సోమవారం లైంగిక వేధింపుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణకు ప్రతి వ్యక్తి సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి సురక్షిత, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత

స్థలం పేరిట మోసం

నెల్లూరు (క్రైమ్): స్థలం పేరిట మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇస్కాన్ సిటీలో ధనమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఇంటి స్థలం కొనుగోలు చేసేందుకు ఆరా తీస్తుండగా చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రసాద్‌రెడ్డి కొండాయపాళెంలో 33 అంకణాల స్థలం ఉందని చెప్పారు. అంకణం రూ.2.50 లక్షల వరకు ఉందని, డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నాయని నమ్మించాడు. లీగల్ ఒపీనియన్ తీసుకునేందుకు డాక్యుమెంట్లు ఇవ్వాలంటే 40 శాతం అడ్వాన్స్ ఇవ్వాలని చెప్పాడు. దీంతో ఆమె ఈ ఏడాది జూలైలో రూ.25 లక్షలు ప్రసాద్‌రెడ్డికి ఇచ్చారు. ఆయన స్థలం తాలుకు డాక్యుమెంట్లు ఇచ్చి అగ్రిమెంట్ కాపీని వాట్సాప్‌లో పంపారు. అగ్రిమెంట్ కాపీలోని వివరాలను ఆరా తీయగా అందులో ఉన్న వ్యక్తి అప్పటికే మరణించారని, ఆ స్థలంపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోందని తేలింది. దీంతో బాధితురాలు తాను మోసపోయానని గ్రహించి ప్రసాద్‌రెడ్డిని నిలదీయగా రూ.10 లక్షలు నగదు తిరిగి చెల్లించారు. మిగిలిన రూ.15 లక్షలకు బ్యాంక్ చెక్కులు ఇచ్చారు. ఆ చెక్కులు బౌన్స్ అయ్యాయి. ఈ మేరకు తనను మోసగించిన ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు సోమవారం ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ విచారించి చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్ పోలీసులను ఆదేశించారు.

క్లుప్తంగా

మహిళను కాపాడిన పోలీసులు


హారికతో ఏఎస్సై భాస్కర్‌రాజు

ఇందుకూరుపేట: కుటుంబ సమస్యల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి నుంచి అదృశ్యమైన మహిళను ఇందుకూరుపేట పోలీసులు సోమవారం కాపాడారు. ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. నెల్లూరు నగరం అయ్యప్పగుడి ప్రాంతానికి చెందిన చెందిన హారిక ఇంట్లో ఉన్న సమస్యల కారణంగా మైపాడు బీచ్‌కు వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని భావించి బయటకు వచ్చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె బంధువు శ్రీలత 112కు సమాచారం ఇచ్చింది. దీంతో ఎస్సై నాగార్జునరెడ్డి ఆమె సెల్‌ఫోన్ ఆధారంగా బీచ్ పక్కనే ఉన్న శివాలయంలో ఉన్నట్లు గుర్తించారు. ఏఎస్సై భాస్కర్‌రాజు ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 89
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 168
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 188
లేయర్ చికెన్	: 187

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

• బాధితులకు ఎస్పీ కృష్ణకాంత్ భరోసా

నెల్లూరు (క్రైమ్): మీ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, విచారించి, క్షేత్రస్థాయిలో మరోసారి సమస్యలు తలెత్తకుండా చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ కృష్ణకాంత్ బాధితులకు భరోసానిచ్చారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 85 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతులు అందజేశారు. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ త్వరితగతిన ఆయా సమస్యలు పరిష్కరించాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట మోసం

కలువాయికి చెందిన సంధ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద రూ.4.25 లక్షలు నగదు తీసుకుంది. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించక పోగా దౌర్జన్యం చేస్తోంది. ఉద్యోగం పేరిట మోసగించిన సంధ్యపై చర్యలు తీసుకోవాలని బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

మోసగించి పెళ్లి చేసుకున్నారు

నా భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని నమ్మించి నన్ను పెళ్లి చేసుకున్నారు. వివాహానంతరం ఉద్యోగం లేదని తేలింది. అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. నన్ను మోసగించి వివాహం చేసుకోవడంతో పాటు అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తింటివారిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళెంకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

కాపురాన్ని చక్కదిద్దాలి

నా భర్త మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ నన్ను, నా పిల్లలను పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నించినందుకు మమ్మల్ని ఇంటి నుంచి గెంటేశారు. కౌన్సెలింగ్ ఇచ్చి నా కాపురాన్ని చక్కదిద్దాలని దర్గామిట్టకు చెందిన ఓ మహిళ ఎస్పీని కోరారు.

ప్రేమ పేరిట వేధిస్తున్నాడు

సుజన్ ఈశ్వర్, నేను ఫిజియోథెరపిస్టలం. నేను పని చేసే సమయంలో అతనితో పరిచయం అయింది. దానిని ఆసరాగా తీసుకున్న అతను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. తగిన చర్యలు తీసుకోవాలి.

యాసిడ్ పోస్తానని బెదిరిస్తున్నాడు..

నాతో పరిచయం పెంచుకున్న బాబు అనే వ్యక్తి ఫోన్‌ను ట్రాప్ చేశారు. నేను ఎవరితో మాట్లాడినా యాసిడ్ పోస్తానని బెదిరిస్తున్నాడు, విచారించి చర్యలు తీసుకోవాలని కొండాపురానికి చెందిన ఓ మహిళ అభ్యర్థించారు.

ఉద్యోగం తీయించేయాలని

నా భర్త మరణాంతరం నాకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. నేనంటే గిట్టని వారు ఉద్యోగం తీయించాలని నాపై అసత్య ఆరోపణలు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు ఉత్తరాలు పంపుతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

చంపుతామని బెదిరిస్తున్నారు

నా భర్త ఆటో మెకానిక్. ఆయన్ను మెకానిక్ షెడ్ యజమాని పఠాన్ బాబు హత్య చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొద్ది రోజులుగా కేసు ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో నన్ను, నా పిల్లలను చంపుతామని నిందితుడు బంధువులు బెదిరిస్తున్నారు. వారి నుంచి నాకు, నా పిల్లలకు ప్రాణహాని ఉంది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని నాకు రక్షణ కల్పించాలని ముజాహిదా ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ విచారించి తగిన చర్యలు తీసుకోవాలని నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు.

ఎస్‌ఏ టర్మ్–1 పరీక్షలు ప్రారంభం

• 11 నుంచి ప్రధాన సబ్జెక్ట్‌లకు..

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి సెల్ఫ్ ఎస్సెస్‌మెంట్ టర్మ్–1 మోడల్ పేపరు 2024–25 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రధాన సబ్జెక్ట్‌లకు సంబంధించి ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రాలను ఎస్సీఈఆర్టీ నుంచి పంపిణీ చేశారు. అయితే కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఎస్సీఈఆర్టీ ప్రశ్నపత్రం లేదా వారి సొంత ప్రశ్నపత్రాలతో పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. 1 నుంచి 5వ తరగతి వరకు 11న తెలుగు లేదా ఉర్దూ, 12న ఇంగ్లిష్, 13న గణితం, 16న ఈవీఎస్ పరీక్షలు జరగనున్నాయి. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 11న తెలుగు, ఉర్దూ, 12న హిందీ, 13న ఇంగ్లిష్, 16న గణితం, 17న భౌతికశాస్త్రం, 18న జీవశాస్త్రం, 19న సాంఘిక పరీక్ష జరగనుంది. ప్రశ్నపత్రాలను ఆయా మండల ఎంఈఓ కార్యాలయాల నుంచి ఏ రోజుకారోజు గంట ముందుగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి 22వ తేదీలోపు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపాల్సి ఉంది. దీంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

అట్టహాసంగా స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

వెంకటగిరిరూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో కమాండెంట్ అరుణ్‌బోస్ పావురాన్ని ఎగుర వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో తొలుత 800, 100 పరుగు పందెలు, వాలీబాల్, లాంగ్‌జంప్, షటిల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలు అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు బెటాలియన్ అధికారులు తెలియజేశారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

కావలి : మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ ఒట్టూరులో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్న బెల్టు దుకాణంపై కావలి ఎక్సైజ్ అధికారులు, నెల్లూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన అప్పనగిరి పోటయ్య అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కావలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో కావలి ఎక్సైజ్ ఎస్సై దేవిక, నెల్లూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ప్రమాదవశాత్తు కిందపడి తలకు గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎన్‌జీఓ కాలనీకి చెందిన కాలేషా (35) సుమారు 12 ఏళ్ల క్రితం నుంచి మద్యానికి బానిసయ్యాడు. మనస్పర్థల నేపథ్యంలో ఏడాదిన్నర క్రితం భార్య, తన పిల్లలను తీసుకుని గూడూరులోని పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి కాలేషా తన తల్లి రహీమాతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 7న ఇంటి వద్ద మెట్లపై జారి కిందపడడంతో తలకు గాయమైంది. గమనించిన తల్లి, కుటుంబ సభ్యులు ఆయన్ను నగరంలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి వైద్యం చేయించారు. చివరకు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు మృతుడి తల్లి రహీమా సోమవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.31
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.12

